

# పుస్తక పరిచయం




ఓ నవల మనకి నచ్చడానికి పలుకారణాలు ఉండవచ్చు. అందులోని పాత్రలూ, సంఘటనలూ మనకు ఎక్కడో పరిచయం ఉన్నట్లు అనిపించడం, లేదా మనం చేయలేని సాహసాలు నవలలో కనిపించడం లేదా అందులోని పాత్రలు కొత్తవే ఐనా మనం కథలోకి నడిచివెళ్ళి ఆ పాత్రలతో కలిసిపోయి, ఆ సంఘటనలను ప్రత్యక్షంగా చూడగలగడం. ఈ మూడో వర్గానికి చెందిన నవలలు వ్రాయడం అనేది పూర్తిగా రచయిత పరిణితి మీదా, నేర్పు మీదా ఆధారపడి ఉంటుంది. అంటే మనకి తెలియని పాత్రలను కూడా మనకి - ఆత్మీయులనిపించే భావాన్ని కలగచేయడం, మనం చూడని సన్నివేశాలనైనా అతి సులువుగా కళ్ళముందు కదిలేలా చిత్రించడం - రచయిత ప్రతిభకు అద్దం పడుతుంది. 'నిదురించే తోటలోకి..' నవల ఈ కోవకు చెందిందే ఇందులోని పాత్రలు మనం లోగడ చూసి ఉండకపోయినా ఇప్పుడు చూడాలనిపిస్తుంది, ఒక్కసారి వాళ్ళు కనిపిస్తే బావుండుననిపిస్తుంది, ఇలాంటి భావాన్ని కలిగించడం మన్నెం శారదగారి లాంటి చేయితిరిగిన రచయిత/త్రులు కొంతమందికే చేతనవుతుంది. నవలా రచయిత్రిగా 30 సంవత్సరాలు పైగా అనుభవం ఉన్న శారదగారు ఇప్పటికీ తన కలం బలం తగ్గలేదని మరోసారి ఋజువు చేశారీ నవలతో. మూడు సంవత్సరాలపాటు కౌముదిలో సీరియల్‌గా వచ్చింది నవల. మొత్తంగా చూసుకుంటే మామూలు ప్రేమా, విడిపోవడం, విషాదాంతం - ఇంతే అనిపిస్తుంది కానీ అద్భుతమైన శైలి, నవల మొదలుపెట్టిన వద్దనుంచి పూర్తయేదాకా ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా చదివిస్తుంది. అలానే సంభాషణలు కూడా - రచయిత్రి వ్రాసినట్లు కాక ఆయా పాత్రలే మాట్లాడినట్లు, ఆయా పాత్రల స్వభావానికి తగినట్లు కొనసాగడం ఈ నవలను ఒక ప్రామాణిక స్థాయిలో నిలబెడతాయి. మనసుని హత్తుకునే వాక్యాలకు కొన్ని ఉదాహరణలు: ఏం పెళ్ళిళ్ళురా.. ఒకళ్ళమీద ఒకళ్ళు వాలిపోవడం, ఒకళ్ళుపోయాక మరికళ్ళు చావలేక బతకడం.. / కనకారావు సరోజనిని అమ్మా అని పిలిచేవాడు. "భార్యలోనూ అమ్మ ఉంటుంది సరోజనీ. అసలు స్త్రీలోనే అమ్మ ఉంటుంది. స్త్రీత్వమే అమ్మ" అనేవాడు. / 'మనల్ని మరొకరు ప్రతిక్షణం శాసిస్తున్నారు' అనే భావనే మనకి నరకాన్ని చూపిస్తుంది. / భర్త ఫోటో చూస్తూ సరోజని అనుకున్నది - "నువ్వెళ్తే ఎల్లావుగానీ ధైర్యాన్ని తీసుకుపోకయ్యా! అందరికీ లోకువయిపోతాను.."

నవల చదివినంత సేపూ పాత్రల భావోద్వేగాలు మనలనూ కదిలిస్తాయి, నవల ముగిసాక మనసు భారమౌతుంది. ఈ రచయిత్రి నవలలు మరికొన్ని చదవాలనిపిస్తుంది..!

★★★

**Author**
**Flat# 504**
**Saiteja Towers, 6th Phase**
**KPHB Colony**
**HYDERABAD – 500 072**




*Writer*
**Somepalli Venkata Subbaiah**
**svsomepalli@gmail.com**
**Phone: 91-9000004565**

కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్యగారి నాలుగవ నానీల సంపుటి ఈ ‘చేను చెక్కిన శిల్పాలు‘. లోగడ వీరి వెలువరించిన నానీల సంపుటులు ‘తొలకరి చినుకులు‘,‘ రెప్పల చప్పుడు‘,‘ పచ్చని వెన్నెల‘. కేవలం నానీలు మాత్రమే కాక వెంకటసుబ్బయ్యగారు –‘లోయలో మనిషి‘,‘ చల్లకవ్వం‘,‘ తదేకగీతం‘ లాంటి వచనకవితా సంపుటాలు కూడా కవితాప్రియులకు అందించారు. పుస్తకాలకు పేర్లు ఎన్నుకోవడంలోనే రచయిత భావుకత, కవిహృదయం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఊపిరి సలపని కార్యక్రమాలతో, బాధ్యతాయుతమైన ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ కూడా వెంకటసుబ్బయ్యగారు చేస్తున్న కవితాసేద్యం బహుధా ప్రశంసనీయం. వీరి కవితలైనా, నానీలైనా కేవలం చెణుకుల్లా కాక ఆలోచింపచేస్తాయి. మనసుకు హత్తుకుంటాయి. లోతైన భావన వీరి నానీల్లోని అధికశాతంలో కనిపిస్తుంది. ‘చనిపోయినా / చిగిర్చే జ్ఞాపకం / అతడూ.. ఆమె.. / ఒకరికొకరు‘. ఇది నానీ ప్రక్రియలో ఒదిగిన గాఢమైన తాత్విక చింతన. ‘చనిపోయినా చిగిర్చే జ్ఞాపకం‘ అనేది కవితారీతుల్లో అద్భుతమైన ప్రయోగం. ‘చల్లని నీళ్ళు / వేడెక్కాయా..?/ అసెంబ్లీలో చర్చ / నీళ్ళపైనేమో!‘ -- పెద్దగా వ్యాఖ్యానం అవసరం లేని వ్యంగ్యాస్త్రం. స్వయంప్రకాశకులకు తళుకు బెళుకుల అవసరం లేదు. అది లేని వాళ్ళకే పైపై మెరుగులు కావాలి , అందుకే ఈ కవి అంటారు "వెలుగు / అతడి చిరునామా/ ఇక తళుకులెందుకు / బెళుకులెందుకు‘" సూర్యుడికే కాదు, సొంతప్రతిభతో నిలబడేవారందరికీ ప్రతీక ఈ నానీ. "ముఖం ముడతకి / ప్లాస్టిక్ సర్జరీ / మనసు మకిలికి / మందేది..?" కొన్ని పేరాల వ్యాసంలోనూ, కథా రూపంలో చెప్పగలిగే సత్యాన్ని నాలుగు పంక్తుల్లో వ్యక్తపరచిన వెంకటసుబ్బయ్యగారి కవితల్లోని సహజసౌందర్యం గురించి వేరే చెప్పాల్సిన అవసరంలేదు. ఈ 34 పేజీల సంపుటిలో ప్రతి నానీకి ఇచ్చిన రేఖాచిత్రాలు కూడా ఎంతో అర్థవంతంగా ఉండడమే కాక ప్రతి ఖండికనూ మళ్ళీ చదివించేలా కొలువు తీర్చాయి. కేవలం కాలక్షేపానికే కాక, చదివి గుర్తుపెట్టుకోదగ్గ నానీలు ఇవన్నీ. కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్యగారు అభినందనీయులు. వారి కలంనుండి మరిన్ని కవితాసంపుటాలు వెలువడాలని ఆశిద్దాం.

★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**